# 13. మరొక సీత కథ!

ధోల్‌పూర్ సంస్థానాధీశులైన హిజ్ హైనెస్ మహారాజా ఉదయ భాను సింహాజీవారు మగువ మొగమెరుగని అపర శ్రీరాములుగా మదిరం చవిచూడని సత్పురుషులుగా వేనోళ్ళ కీర్తింపబడుతున్న పుణ్యపాలనలో...

శ్రీవారు శ్రద్ధగా నెరవేర్చే రాచకార్యాలలో వేటాడ్డం అనేది అతి ముఖ్యమయినది. అందునా బాతులను పెంచడంలోను వాటిని వేటాడి ఖతం చేయటంలోనూ శ్రీవారు సిద్ధహస్తులు.

శ్రీవారి రాజధానీ నగరానికి కేవలం అయిదారు మైళ్ళ దూరంలోనే ఏ నాజ్ మొగల్ పాదుషా షాజహాన్ త్రవ్వించిన దాదాపు పదిమైళ్ళ వైశాల్యంగల బ్రహ్మాండమైన సరోవరం ఉండేది. దానిలో సదా నిండుగా నీరుండే ఏర్పాట్లుండటాన ఏ కాలంలోనయినా ఆ సరోవరంలో లెక్కకు అందనన్ని బాతులు అసంఖ్యాకంగా విహరిస్తుండేవి. వాటి పెంపకంలో మహారాజావారే ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. ఆ సరోవర పరిసరవనాల్లో పులుల్నీ, తదితర జంతువుల్నీ కూడా శ్రీవారే ప్రత్యేక శ్రద్ధతో పెంచే వారు కనుక.........

మహారాజావారి అతిధులుగా శ్రీవారి తల్‌షాహీ సరోవరతీరానగల బ్రహ్మాండమైన ప్యాలస్‌లో ఖుషీచేస్తూ వేటాడ్డంఅంటే దేశంలోని ఏ మహా రాజావారి కయినా మహాసరదాగా ఉండేది. వారి సంగతలా ఉంచి భారత సంస్థానాధీశులతో సంబంధాలు పెట్టుకొనడంలోనూ, వారి అతిధ్యాలను స్వీకరించడంలోనూ నియమబద్ధంగా ఉండే బ్రిటిష్ ఉద్యోగులు, వైస్రా యిలూ కూడా ఈ విషయంలో తమ నియమాలన్నీ సడలించుకునేవారు.

తల్‌షాహీ ప్యాలస్‌లో మహారాజావారిచ్చే ఆతిధ్యం అపూర్వమయి నది, రోజూ సాయం సమయంలో ఖరీదయిన విదేశీ మద్యాలూ, అత్యంత రుచికరమైన పదార్థాలు విరివిగా అందజేయ బడేవి. అతిధులంతా సరోవర తీరాల్లో విహరిస్తూ, వాటిని ఆస్వాదిస్తూ మరోలోకంలో తేలిపోతున్నట్లుగా ఫీలయ్యేవారు. భోజన సమయంలో ప్రత్యేకంగా తెప్పించిన ఫ్రెంచి మద్యాలూ, వంటకాలూ రుచి చూసేవారు. భోజనానంతరం కూడా విరి విగా పానీయాలు అందించబడేవి.

ఇహ, వేట సంగతి సరేసరి: గురి చూడటం చేతకాని వారుకూడా తుపాకి పేల్చారంటే ఒక్క గుండు దెబ్బకు కనీసం అయిదారు బాతులకు తక్కువ గాకుండా చచ్చిపడేవి. ఆ సరోవరంలో బాతుల సంఖ్య అంత విరివిగా క్రిక్కిరిసి ఉండేది ఒక్క రోజులో అతిధులంతా కలసి ఓ వెయ్యి బాతుల్ని కాల్చేశారనుకున్నా ఆ వెన్వెంటనే మరో వెయ్యి బాతు లని తెచ్చి సరోవరంలో వదిలేవారు. అందు కనుగుణంగా క్రమ పద్ధతిలో బాతుల్ని పెంచే ఏర్పాట్లు మహారాజావారు చేయించి ఉన్నారు.

సాధారణంగా ఈ పార్టీలు వరుసగా వారం రోజులపాటు జరిగేవి. ఈ వారం పూర్తయేసరికి మహారాజావారి అతిధులైన రాజులూ, పెద్దపెద్ద బ్రిటిష్ ప్రభుత్వోద్యోగులు, వైస్రాయిలూ, వారు వారు తమవెంట ఖుషీ చేసేందుకుగాను తెచ్చుకున్న ప్రేయసులూ, ఉంపుడుకత్తెలూ, మరిక సెక్సు కలాపాల్లో పాల్గొనే ఓపిక లేనంతగా అలసిపోయేవారు.

తన సమక్షంలోనే తన పర్యవేక్షణ క్రిందనే ఇంత జరుగుతున్నా మహారాజా ఉదయభాను సింహాజీవారు మాత్రం ఎట్టి పరిస్థితులలోనూ, మద్యం జోలికి మాత్రం పోయేవారు కారు. వారా విషయంలో నిష్టాగరి ష్టులు. అంతేగాదు. వారు స్త్రీద్వేషి. కనీసం భార్య జోలికికూడా పోరని

ప్రతీతి. కనుకనే శ్రీరాములవారే వారికి సాటియనీ ప్రతీతి ప్రబలి పోయింది.

కానీ, కానీ, శ్రీవారికి ఓ చిన్నలోపం మాత్రం ఉండేది. రాంప్యారీ అనే దాసీ యువతి అంటే రాజావారికి మక్కువ ఎక్కువ ఇది మాత్రం రాజావారికి వారి అంగరక్షకుల్లో అతి ముఖ్యుడైన తిగ్నాల్ సింగ్‌కు తప్ప మరెవరికీ తెలియని పవిత్ర రహస్యం. మహారాజావారు తల్‌షాహీ క్యాంపుకు వెళ్ళినపుడల్లా ఆవిడ తప్పనిసరిగా రప్పింపబడేది. అతిధు లెవరికీ ఆవిడ జాడగాని వాసనగానీ తగలకుండా జాగ్రత్తలు తీసుకో బడేవి. మహారాజావారి అతిధులంతా విడిదిచేసే బ్రహ్మాండమైన పాలరాతి ప్యాలస్‌కూ, కాటేజీలకూ దూరంగా శ్రీవారికి ఏకాంతగృహం ఒకటుండేది. సాధారణంగా మహారాజావారు రోజూ వేట పూర్తికాగానే అతిధులవద్ద వీడ్కోలు తీసుకొని వెళ్ళి ఆ గృహంలో గడిపేవారు. అహా, మహారాజా వారెంత నిరాడంబరులు! ఈ ఇంద్రభవనాన్ని కాదని మామూలు కాటేజీలో ఉంటారే!" అని అతిధులంతా ఆయన్నాకాశాని కెత్తేవారు.

సదరు నిరాడంబరమైన చిన్న కాటేజీలో...ఓ గాలీ వెలుతురూ సరిగా రాని గదిలో మహారాజావారి దాసీ ప్రేయసి రాంప్యారీ ఒంటరిగా మగ్గుతుండేది.

ఆవిడ పొరపాటునయినా ఏ నరవానవుడికంటా పడగూడదని మహారాజా వారి కోరిక. అదే జరిగితే లోకంలో తనకున్నకీర్తికి కళంకం కలగవచ్చునని వారి భయం. కనుక ఆమె ఉండే గది తలుపులూ, కిటి కీలూ సదా మూసివేసే ఉండేవి. రాజావారి పరిచారకులకు కూడా తెలి యని మహా రహస్యం ఇది. మహారాజావారు రోజూ ఆ కాటేజీ వదలి వెళ్ళేముందు స్వయంగా రాంప్యారీ ఉన్న గదికి తాళంవేసి మరీ వెళ్ళేవారు,

మహారాజా వారిలో ఉన్న పెద్ద జబ్బు ఏమంటే శ్రీవారికి రాణులనూ మహారాణులనూ, రంభల్నీ, ఊర్వసుల్నీ చూసినా చలనం కలిగేది కాదు గానీ, రాంప్యారీలా సాదాగా ఉండే సామాన్య స్త్రీలను చూస్తే మాత్రం ఉద్రేకం కట్టలు త్రెంచుకునేదట. కనుక రాజధానికి దూరంగా తల్‌షాహి సరోవర తీరాన అతిథులతో కాలక్షేపం చేసే ఈ వారం రోజులూ శ్రీవారికి పరగడుపు. స్త్రీ వాసన నెరుగని రాజావారికి ఈ వారం రోజులూ రాం ప్యారీ భోగ్యవస్తువు. వారి పాలిట సీతాదేవి.

అలా వేటలతో, ఆటలతో, పాటలతో, కేళీవిలాసాలతో వారం రోజులూ అతిథులంతా అలసిపోయాక, ఓ సుదినాన మహారాజావారు వీడ్కోలు విందు ఏర్పాటుచేశారు. ఆ ఘనమైన, చిరస్మరణీయమైన విందు పూర్తయి మహారాజావారు అతిథులెల్లరివద్దా శెలవు తీసుకుని, తన కాటేజీకి యధావిధిని చేరి, ఉత్సాహంతో రాంప్యారీ గది తాళం తీసి ఆవిడ అక్కున చేరబోయేసరికి...

ఆవిడ స్పృహలేని స్థితిలో, నాడి దాదాపు అందని దశలో నిశ్చేతనంగా మంచానపడి ఉన్నది. ఆ గది నిండా పొగ క్రమ్ముకొని ఉంది. ఆ రోజు చలికి ఆగలేక బొగ్గుల కుంపటి ముట్టించి చలికాచుకుంది, రామ్ ప్యారీ ! కానీ, గది తలుపులూ, కిటికీలూ అన్నీ బంధింపబడి ఉండటాన పొగ బయటకుపోయే దారి లేక అది ఆవిడ మీదనే తన ప్రభావాన్ని చూపించి ఊపిరాడకుండా చేసేసింది.

ఆవిడకు స్పృహ తెప్పించేందుకు మహారాజావారు చేయగలిగిన దంతాచేశారు గానీ, ప్రయోజనం లేకపోయింది. తప్పనిసరై చివరికి ప్యాలస్‌లో నిషాలో నిద్రబోతూన్న ఆస్థాన వైద్యుడికి కబురు చేసేరు.

రాజా వారికి ఏమయిందోనని పరుగెత్తుక వచ్చిన ఆస్థాన వైద్యుడు

అచేతనంగా పడి ఉన్న రాంప్యారీనీ, ఆ గదినీ, తలుపులన్నీ మూసి వేయబడి, పొగతో నిండి ఉన్న ఆ వాతావరణాన్నీ చూసి, అసలే నిషాలో ఉన్నాడేమో ఆవేశంతో, ఆగ్రహంతో మహారాజావారి మీద చిందులు త్రొక్కాడు. నీవు మనిషివిగాదు. రాక్షసుడవన్నాడు. ఎంత దాసీనైనా ఇలాంటి గదిలో ఊపిరాడకుండా తలుపులన్నీ వేసేసి రహస్యంగా ఉంచటం ఘోరమన్నాడు.

పరువు పోతుందేమోనని రాజావారు అన్నీ తలొంచుకు విన్నారు. "నీకు లక్షలిస్తాను ! ఈ సంగతి ఎవరికీ చెప్పకు ! నా 'దాసీదాన్ని' బ్రతికించు" అని ప్రాధేయపడ్డారు.

కానీ.. అప్పటికే మహారాజావారి ముద్దుల ప్రేయసి రాంప్యారీ ఈ లోకం వదలిపోయింది.

అయినా రాజావారి కీర్తికి కళంకంలేదు. ఎందుకంటే శ్రీవారు పాప పరిహారార్థం వరుసగా నాలుగు రోజులు నిరాహారదీక్ష పూనేరు. ఆ తరువాత పవిత్రక్షేత్రం హరిద్వారర్ వెళ్ళి పాపాలన్నీ శుభ్రంగా కడిగేసుకున్నారు.

ఆ తర్వాత హిమాలయాల్లోని సోలాన్ సానువుల్లో తపస్సు చేసుకొనే తన ఆధ్యాత్మిక గురువుగారి దర్శనం చేసుకుని, వారికి యధావిధిని దక్షిణలూ గట్రా సమర్పించుకుని పనిలో పనిగా తన పాపాలను కూడా పుణ్యంగా మార్చేందుకు తపస్సు చేయవలసిందిగా వారికి విన్నవించుకుని...

మరలా ధోల్‌పూర్ సంస్థానానికి విచ్చేసి మహారాజా ఉదయభాను సింహాజీ వారు సర్వులూ రామరాజ్యమని కీర్తిస్తుండగా చచ్చేదాకా రాజ్యం చేశారు.

★